క్లుప్తంగా

సన్మానం



పలిమెల: ఇటీవల పదవీ కాలం ముగిసిన పలిమెల గ్రామ పంచాయతీ సర్పంచ్ జవ్వాజి పుష్పలత–తిరుపతిలను శుక్రవారం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దింటి మల్లయ్య, గ్రామస్తులు తిరుపతి, జనగాం సమ్మిరెడ్డి, సూరిబాబు, సురేష్, బాలకుమార్, రవీందర్, నారాయణ, గోవర్ధన్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో..



మహాముత్తారం: పదవీకాలం పూర్తయిన సందర్భంగా మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సభ్యులకు ఆత్మీయ సమ్మేళన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, గ్రామ ప్రత్యేకాధికారి పెద్ది ఆంజనేయులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక



భూపాలపల్లి రూరల్: సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నట్లు సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు భుక్యా సురేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా బానోత్ రాజు నాయక్, ఉపాధ్యక్షులుగా అజ్మీరా తిరుపతి, భూక్యా సురేష్, ప్రధాన కార్యదర్శిగా అజ్మీరా సమ్మయ్య, కార్యదర్శులుగా నంగవత్ భాస్కర్, కీర్తిబాయి, అంగోత్ శారదా, కోశాధికారిగా గుగులోత్ సంతోష్, గౌరవ అధ్యక్షులుగా ఇస్లావత్ దేవన్, జంపన్న, నంగవత్ రాజేష్, గౌరవ సభ్యులుగా గుగులోత్ వాలు, భూక్యా రమేష్, హత్కార్ రాజు, భూక్యా రూప్ సింగ్, భిక్షపతి, రాజు, లవుడియా మదుకర్, రాజు నాయక్‌లను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎల్ఓసీ మంజూరు

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ తండ్రి రాజయ్య ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు నగదు లేక ఇబ్బంది పడుతూ ఎమ్మెల్యే సత్యనారాయణరావును కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి శుక్రవారం రూ.5లక్షల ఎల్ఓసీని మంజూరు చేశారు.

పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని మహ్మద్ గౌస్‌పల్లి గ్రామానికి చెందిన మేకల మధు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ శుక్రవారం పరామర్శించారు. మధు మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, చింతనిప్పుల భిక్షపతి, ప్రశాంత్, సురేష్, మొగిలి, కిషన్, రాజేందర్, దేవేందర్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శాయంపేట : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజ్వల్ పీయూ మేనేజర్ ప్రియాంకరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్వహిస్తున్నటువంటి నేల పునరుత్పాదక వ్యవసాయ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా నేల నిస్సారిత్య స్థితిలో ఉన్నటువంటి నేలల్లో అదనపు ఆదాయం సమకూర్చేందుకు రైతులకు మామిడి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రియాంకరెడ్డి మాట్లాడుతూ వరద నీటికి గురైన ముంపు ప్రాంతాలను నివారించడం కోసం గట్ల వెంబడి మొక్కలను పెంచుకోవాలని సూచించారు. అంతేకాకుండా అదనపు ఆదాయాన్ని సమకూర్చే పంటలైన మామిడి తోటలను సాగు చేయాలని సూచించారు. ఈ తోటలో మూడేళ్లు అంతర పంటగా వివిధ పంటలకు సాగు చేసుకోవచ్చని, అంతే కాకుండా దీని ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. ప్రజ్వల్ సంస్థ ద్వారా రైతులకు మొక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజ్వల్ క్షేత్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



కాళేశ్వరం: పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది



మహాముత్తారం: పనులను పరిశీలిస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు

మహాముత్తారం: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యాక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని నల్లగుంటవీ ఎనాజీపేట ప్రధాన రహదారిలో రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చి మెక్కలను జేసీబీ ద్వారా తొలగించారు. అదే విధంగా పుర వీధుల్లోని చెత్తను తొలగించారు. ఈ కార్యాక్రమాన్ని జీపీ ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంలో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ప్రభుత్వం ప్రవేశపెట్టి స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా మూడవ రోజు పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శుక్రవారం పంచాయతీ సిబ్బంది చెత్తను తొలగించారు. మురికి నీటితో పేరుకుపోయిన వాటిని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, కారోబార్ సాయికిరణ్ ఉన్నారు.

మేడారానికి ప్రత్యేక బస్సులు నడిపించాలి



మాట్లాడుతున్న జవ్వాజి తిరుపతి

పలిమెల: మండలంలో ఆయా గ్రామాలను కలుపుకొని మేడారం జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ యన విలేకరులతో మాట్లాడుతూ.. మండలం నుంచి మేడారానికి బస్సు సర్వీసులను నడపడ ం మూలంగా పలిమెల మండలంలోని ప్రజలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యం కలుగుతుందన్నారు. కావున ప్రభుత్వం ప లిమెల మండలం నుంచి మేడారానికి బస్సుల ను నడిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ మల్లల్‌రావు

మల్హర్: మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను శుక్రవారం ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని తాడిచర్ల, మల్లారం, చిన్నతూండ్ల, పెద్దతూండ్ల, రుద్రారం తదితర గ్రామాలకు చెందిన 34మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘దళిత బంధు’ నిధులు విడుదల చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): దళిత బంధు నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని దళితబంధు ఐక్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో దళితబంధు ఐక్య పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. దళితబంధు రాష్ట్ర కన్వీనర్, కోశాధికారి చిట్టిమల్ల సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, నాయకులు మడికొండ రమేష్, కావేరి చిన్నికృష్ణ, సంజీవ, రాజాబాబు, కొండయ్య, శ్రీకాంత్, లేగల రవి, ఓంకార్ ఉన్నారు.

ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

మొగుళ్లపల్లి: మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో రేపు (ఆదివారం) నిర్వహించనున్న గురుకుల ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరిటెండెంట్ ప్రిన్సిపాల్ అలుబోజు వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్ తో పాటుగా విద్యార్థి ఆధార్ కార్డును కూడా చూపించవలసి ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించబడుతుందని తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్

కాటారం: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని విలాసాగర్ సమీపంలో గల మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా అవుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో శుక్రవారం తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది మానేరు వాగు వద్ద పరిశీలించారు. ఇసుక రవాణా జరుగుతున్నట్లు గుర్తించి ఇసుక అక్రమ రవాణా నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ఫార్మసిస్టుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అప్పయ్య, జగదీశ్

ములుగు: జిల్లా ఫార్మసిస్టుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, సూపరింటెండెంట్ జగదీశ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పయ్యను, జగదీశ్‌ను జిల్లా ఫార్మసిస్టుల సంఘం అధ్యక్షుడు వినోదర్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, సభ్యులు కిరణ్, స్వామి శాలువాకప్పి సన్మానించారు. అనంతరం అప్పయ్య మాట్లాడుతూ.. వైద్య సేవలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైందని అన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. నిరంతరం వైద్యులు, ఆస్పత్రికి వచ్చే వారితో సమన్వయంగా మెలగాలని అన్నారు. డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ.. ఫార్మసిస్టుల సేవలు గొప్పవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డెమో తిరుపతయ్య, సీనియర్ అసిస్టెంట్ గణేశ్, ఫార్మసిస్టు షీలా, తదితరులు పాల్గొన్నారు.

నియోనాటల్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం 108 నియోనాటల్ సేవలపై ఏఎన్ఎంలకు, ఆశవర్కర్లకు అవగాహన కల్పించారు. 108 నియోనాటల్ అంబులెన్స్‌లను అప్పుడే పుట్టినటువంటి పిల్లల నుంచి మూడు సంవత్సరాల వరకు ఉపయోగించుకోవచ్చాన్నారు. వాహనంలో అత్యాధునిక పరికారాలు, టెక్నాలజీలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ తిరుపతి, పైలట్ ఓదేలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాత కమిటీతోనే జాతర నిర్వహణ

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి–ముల్కలపల్లి గ్రామాల మధ్యన నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతరను పాత కమిటీతోనే నిర్వహించాలని ఎండోమెంట్ అధికారులు తెలిపారు. జాతర నిర్వహణకు కమిటీ సభ్యులు, రాజకీయ నాయకుల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో అధికారులు ఆదేశాలు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. రెండు గ్రామాలకు చెందిన ప్రజలు కొంత భూమిని శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ మేడారం జాతరకు కేటాయించి.. 1977లో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు కొన్ని డబ్బులు చందాలరూపకంగా వేసుకొన్నారు. అందులో సభ్యత్వ రుసుం పొంది రెండు గ్రామాల్లో సభ్యత్వం పొందిన జాతర నిర్వహణ కమిటీ సభ్యులు ఒక ఒప్పందం చేసుకున్నారు. అప్పటి నుంచి ఒక మారు చైర్మన్ పదవి మొగుళ్లపల్లికి, మరోమారు ముల్కలపల్లి గ్రామస్తులకు ఇచ్చుటకు అంగీకారం చేసుకున్నారు. అప్పటి నుంచి జాతర నిర్వహణలో ఏలాంటి లోటుపాటులు లేకుండా.. రాజకీయ ప్రమేయం లేకుండానే సమర్థవంతంగా నిర్వహించేవారు. కానీ ఈనెల 21, 22, 23న నిర్వహించే జాతరకు జాతర కమిటీ ఏర్పాటుతో పాటు రాజకీయ నాయకుల కమిటీ ఏర్పడింది. దీంతో సమ్మక్క–సారలమ్మ జాతరను ఏ కమిటీ నిర్వహిస్తుందోనని ఆందోళన చెందారు. రాజకీయ జోక్యం లేనప్పుడే జాతరను ఒక మహా ఉత్సవంలా నిర్వహించేవారని, ఇప్పుడు రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో జాతర నిర్వహణ సజావుగా సాగేనా..? అనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో రంగప్రవేశం చేసిన ఎండోమెంట్ అధికారులు జాతర నిర్వహణలో రాజకీయ జోక్యం తగదని, పాత పద్ధతిలోనే జాతర కమిటీతో నిర్వహణకు ఎండోమెంట్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జాతర నూతన కమిటీకి ఐదుగురు సభ్యులతో ఏర్పాటుకు ఈనెల 8న నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఫిబ్రవరి 28 వరకు అర్హులైన వారు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. కాగా కొత్త కమిటీ ఏర్పాటు సమయానికి జాతర నిర్వహణ సమయం ముగిస్తుంది కాబట్టి ఈ ఏడాది పాత కమిటీ పద్ధతిలోనే జాతర కమిటీని ఏర్పాటు చేసుకొని యధావిధిగా జాతరను కొనసాగించుకోవాలని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

లింగ వివక్షను పూర్తిగా రూపుమాపాలి



అవగాహన కల్పిస్తున్న అనూష

మల్హర్: అక్కడక్కడా కనిపిస్తున్న లింగ వివక్షను రూపుమాపాలని మిషన్ శక్తి ఇన్‌చార్జ్ కోర్డినేటర్ అనూష అన్నారు. మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. బాలబాలికలకు ఎలాంటి సమస్యలు వచ్చిన చైల్డ్‌లైన్ 1098కు సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం దేశ వ్యాప్తంగా బేటి బచావో బేటి పడావో నినాదంతో బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలపై ప్రజలకు అవగాహన పెంపొందించే చర్యలు తీసుకుంటదని వివరించారు. మహిళలు ఆపద సమయంలో 181, పిల్లలు వారి హక్కులకు భంగం కలిగిస్తే 1098 ట్రోల్ ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, పాఠశాఖ హెచ్ఎం భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కొయ్యడ సురేందర్

వాజేడు: 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసి సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ధర్మవరం, జగన్నాథపురం పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించి ఉపాధ్యాయుల కష్టాలు, నష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఎన్నికల ముందు ప్రకటించినట్లుగా ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల విశ్వాసాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రౌతు రాజు, రాష్ట్ర నాయకులు రామ గిరి సురేష్, కిరణ్, కనకయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షల అనంతరం విక్టరీ సింబల్ చూపిస్తున్న సిబ్బంది

వాజేడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను జిల్లా ప్రోగ్రాం అధికారి పోరిక రవీందర్ ఆదేశాల మేరకు నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లుగా గుర్తించిన 36 మందికి ఈ పరీక్షలను చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మధుకర్, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, వెంకటరమణ, చిన్న వెంకటేశ్వర్లు, శేఖర్, ఛాయాదేవి, దేవి, శాంత కుమారి, సరిత, అక్కెమ్మ, రమణ, నాగమణి, కాంత, కన్నమ్మ ఉన్నారు.

జాతర పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న బండారు రవికుమార్

వాజేడు: మేడారం జాతర మరో పది రోజులే ఉన్న నేపథ్యంలో అక్కడ చేపట్టిన జాతర పనుల్లో జాప్యం జరుగుతుందని యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని పూసూరు గ్రామంలో శుక్రవారం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రవికుమార్ హాజరై మాట్లాడారు. మేడారం జాతర దగ్గర పడిందని అక్కడ పూర్తి కావాల్సిన పారిశుద్ధ్యం, రహదారులు, మంచి నీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. పనులు ఆలస్యంగా ప్రారంభం కావడంతో త్వరగా పూర్తి చేయలనే కారణంతో నాణ్యతా ప్రమాణాలను పట్టించు కోకుండా రూ.వందల కోట్ల పనులను తూతూ మంత్రంగా చేస్తున్నట్లు ఆరోపించారు. జాతర సందర్భంగా చుట్టూ పక్కల గ్రామాల రైతులు యాసంగి పంటకు అంతరాయం కలుగడంతో తీవ్రంగా నష్ట పోతున్నట్లు తెలిపారు. అలాంటి రైతులందరికీ నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరంగల్ నుంచి ఏటూరునాగారం వరకు ఉన్న ప్రధాన రహదారి ధ్వంసం కావడంతో జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నట్లు చెప్పారు. అధికార యంత్రాంగం తక్షణమే చొరవ తీసుకుని జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కాంట్రాక్టర్లతో పనులను చేయించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, తుమ్మల వెంకట రెడ్డి, సాంబశివ, రత్నం రాజేందర్, దావూద్, రాములు, చిట్టి బాబు, ఆగి రెడ్డి, చిరంజీవి, రాజేష్ ఉన్నారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



టేకుమట్ల: పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకల్లో ఉపాధ్యాయులు



మొగుళ్లపల్లి: జెండా ఆవిష్కరిస్తున్న పోలు నాగరాజు

టేకుమట్ల: పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ వేడుకలు మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎండీ హకీం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ టీఎస్ వ్యవస్థాపకుడు సామల యాదగిరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. అనంతరం హకీం మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందుంటుందని అన్నారు. ఇప్పటి వరకు ఎన్నో సమస్యలను పరిష్కరించిందని, ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మియాపురం జగన్నాథం, తోట మహేందర్, మామిడి సురేష్, సోమిడి స్వామి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు పోలు నాగరాజు పతకావిష్కరణ చేసి మాట్లాడారు. పీఆర్టీయూ ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యరంగ అభివృద్ధికి ఎంతోకృషి చేసింది అన్నారు. భవిష్యత్‌లో కూడా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కరానికి సంఘం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పింగళి విజయపాల్ రెడ్డి, సామల రమేష్, కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మండల అసోసియేట్ అధ్యక్షుడు కుమారస్వామి కార్యదర్శి చంద్రయ్య ఉపాధ్యాయులు రాజు, సధాకర్, రంగారావు, శ్రీనివాసు, వేణు, సదయ్య, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

‘మహాలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకంపై అధికారులు ఇంటింటికి వెళ్లి డాటాను పరిశీలిస్తున్నారు. మండలంలోని పత్తిపాకలో శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్ డాటా సేకరణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటర్ ఆపరేటర్లతో ఆన్‌లైన్ వివరాలను పొందుపర్చాలని, మహాలక్ష్మి పథకంలో మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఐదువేల మంది గ్యాస్ వివరాల నమోదు చేయాల్సిన జాబితా వచ్చిందన్నారు. గ్యాస్ వినియోగదారుల ఇళ్లకు వెళ్లి వారి నుంచి గ్యాస్ కన్జ్యూమర్ నెంబర్ ఏజెన్సీ వివరాలు, మొబైల్ నెంబర్‌ను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.